సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 2 । మార్చి । 2024



పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

పుర, నగర పాలక సంస్థల్లో ఆస్తిపన్ను బకాయిలు చెల్లిస్తే 90 శాతం వడ్డీ రాయితీ వర్తింపజేయనున్నారు. 8లో



...చర్యలు తప్పవు

ఠాణాకు వచ్చే ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 22°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఉష్ణోగ్రత పెరిగి, మధ్యాహ్నం అధికంగా నమోదవుతుంది. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘ఏకలవ్య’లో ప్రవేశాలకు ఆహ్వానం

భద్రాచలంఅర్బన్: 2024–25 విద్యా సంవత్సరానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 8 ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో 6 తరగతి(ఇంగ్లిష్ మీడియం–సీబీఎస్‌ఈ సిలబస్)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గండుగులపల్లి, పాల్వంచ, గుండాల, టేకులపల్లి, చర్ల, దుమ్ముగూడెం, ములకలపల్లి, సింగరేణి ప్రాంతాల్లో పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈనెల 22వ తేదీ వరకు (హెచ్‌టీటీపీ//టీఎస్‌ఈఎంఆర్‌ఎస్.తెలంగాణ.గౌట్.ఇన్.) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని, ఇతర వివరాలకు సమీపంలోని ఏకలవ్య పాఠశాలలను సందర్శించాలని వివరించారు.

పరీక్ష కేంద్రంలో డీఐఈఓ తనిఖీ

టేకులపల్లి: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు మూడో రోజు ప్రశాంతంగా జరిగాయి. డీఐఈఓ బి.సులోచనారాణి టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఓ బాబు, సీఎస్ కల్పనని వివవరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ 138 మంది విద్యార్థులకు గాను 131 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరయ్యారు. డీఐఈఓ వెంట డీఈసీ సభ్యులు యూసుఫ్, సుధాకర్‌రెడ్డి ఉన్నారు. ఎస్‌ఐ షేక్ సైదా రహూఫ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉమ్మడి జిల్లాకు ఎంపీ నిధులు

201 పనులకు రూ.9.38 కోట్లు మంజూరు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 218 అభివృద్ధి పనులకు రూ.9.80 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, 201 పనులకు రూ.9.38 కోట్లు మంజూరయ్యాయని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తన పదవీ కాలంలో వంద శాతం ఎంపీ నిధులను సద్వినియోగం చేశానని పేర్కొన్నారు. మంజూరైన నిధులను సీసీ రోడ్లు, కల్వర్టులు, పాఠశాల, పీహెచ్‌సీ, అంగన్‌వాడీ భవనాల ప్రహరీల పనులకు వెచ్చించనున్నట్లు తెలిపారు.


కోర్టు భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న కొత్తగూడెం సీనియర్ సివిల్ జడ్జి రామారావు

దమ్మపేట: దమ్మపేటలో శనివారం ప్రారంభించనున్న జూనియర్ సివిల్ జడ్జ్ కం జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాన్ని కొత్తగూడెం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రామారావు శుక్రవారం పరిశీలించారు. ఈ భవనాన్ని నేడు హైకోర్టు న్యాయమూర్తి ఈవీ.వేణుగోపాల్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ కరుణాకర్, దమ్మపేట ఎస్సై సాయికిషోర్‌రెడ్డి, న్యాయవాది రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కొత్తగూడెంరూరల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గొల్లపూడి భానుమతి అన్నారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని దారా ఫంక్షన్‌హాల్‌లో సఖి జాతీయ మహిళ మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబం ఉన్నత స్థితిలో ఉండాలంటే మహిళ పాత్ర ఎంతో కీలకమని అన్నారు. నరాల సత్యనారాయణ, మెండు రాజమల్లు పాల్గొన్నారు.

ఉద్యానశాఖ అధికారి మరియన్న బదిలీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ఉద్యాన, పశుసంవర్ధక శాఖాధికారి జినుగు మరియన్న మహబూబాబాద్‌కు బదిలీ అయ్యారు. మహబూబాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న కె.సూర్యనారాయణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు హార్టీకల్చర్ డైరెక్టర్ డాక్టర్ సత్యశారద శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ముర్రేడుతో ముప్పే!

మళ్లీ మొదటికొచ్చిన వాగు పనులు

- గత ప్రభుత్వ హయాంలో రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన
- సర్కారు మారడంతో పనులకు బ్రేక్
- కొత్తగా మళ్లీ ప్రతిపాదనల తయారీ



ముర్రేడు వరద ఉధృతితో కూలిపోయిన ఇళ్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణ వాసులకు ఈ వానాకాలంలోనూ ముర్రేడు వాగుతో ముప్పు తప్పేలా లేదు. వరదల కారణంగా తీర ప్రాంతం కోతకు గురికాకుండా ఉండేందుకు నిర్మించతలపెట్టిన రక్షణ గోడ నిర్మాణ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

వానొస్తే వరద పోటు..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణాన్ని చీల్చుకుంటూ ముర్రేడు వాగు ప్రవహిస్తోంది. గోధుమవాగుతో పోల్చితే ముర్రేడువాగు వెంట అనేక కాలనీలు విస్తరించి ఉన్నాయి. ఇందులో వందల సంఖ్యలో నివాస గృహాలతో పాటు విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు, వివిధ మతాల ప్రార్థనాలయాలు ఉన్నాయి. ప్రతీ ఏడాది వానాకాలంలో ముర్రేడులో వరద పోటెత్తుతోంది. ఇరువైపులా తీరాలను తాకుతూ వరద ప్రవహిస్తోంది. దీంతో తీరం వెంట పదికి పైగా నిర్మాణాలు నీటిపాలవుతున్నాయి. ఈ మేరకు ఆయా కుటుంబాలకు తీరని నష్టం వాటిల్లుతోంది. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికే 40కి పైగా ఇళ్లు ముర్రేడులో కలిసిపోయాయి. దీంతో ముర్రేడు వాగు కోతలతో తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించేందుకు గత ప్రభుత్వ హయాంలో వాగుకు ఒక వైపు రక్షణ గోడ నిర్మించేందుకు రూ.35 కోట్లు మంజూరు చేయగా.. గత ఎన్నికల ముందు శంకుస్థాపన కూడా చేశారు.

నిలిచిన పనులు..

ముర్రేడు వాగు రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన కొద్ది రోజులకే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, ఆ తర్వాత ఎన్నికలు జరగడంతో పనులు నిలిచిపోయాయి. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మరోవైపు స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఓటమి పాలవగా కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచి గెలుపొందారు. ప్రభుత్వం కొలువుదీరి 100 రోజులు కావస్తున్నా ముర్రేడు వాగు రక్షణ గోడ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ నిధుల మంజూరు విషయంలో ఆర్థిక శాఖ నుంచి పరిపాలన అనుమతులు జారీ కాలేదు. దీంతో పనులు ఆగిపోయాయి.

మరోసారి ప్రతిపాదనలు..

ముందుగా రూపొందించిన ప్రతిపాదనల ప్రకారం ముర్రేడుకు రక్షణ గోడ నిర్మాణాన్ని వాగుకు ఇరువైపులా కాకుండా వరద తీవ్రత ఎక్కువగా ఉన్న లక్ష్మీదేవిపల్లి వైపునే చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో జాతీయ రహదారి వంతెనకు సాయిబాబ గుడి వైపు ప్రధాన రోడ్డు నుంచి 400 మీటర్లు, సాయిబాబా గుడికి ఎదురుగా ప్రధాన రహదారి నుంచి 1.20 కిలోమీటర్ల నిడివితో రక్షణ గోడ నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ ప్రకారమైతే ముర్రేడుపై 1.60 కి.మీ. నిడివితో రక్షణ గోడ నిర్మాణం జరగనుంది. దీనికి జిల్లాలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా గేబియన్ డిజైన్‌ను ఎంపిక చేశారు. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో మరోసారి ప్రతిపాదనలు సిద్ధం కానున్నాయి.

వాకింగ్ ట్రాక్ నిర్మించేనా..?

అభివృద్ధి చెందుతున్న అన్ని పట్టణాల్లో నీటి ప్రవాహాల వెంట మార్నింగ్ వాక్ ట్రాక్‌లు నిర్మిస్తున్నారు. పాత ప్రతిపాదనల ప్రకారం ముర్రేడు వెంట 1.2 కి.మీ నిడివితో రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఇది గేబియన్ డిజైన్ కావడంతో మార్నింగ్ వాక్ ట్రాక్ , ఓపెన్ జిమ్ తదితర సౌకర్యాలకు అవకాశం తక్కువ. ప్రస్తుతం కొత్తగా రక్షణ గోడ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో కరకట్ట తరహాలో డిజైన్ చేసి ముర్రేడు తీరం వెంబడి మార్నింగ్ వాక్ ట్రాక్‌ను సిద్ధం చేస్తే ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుందనే డిమాండ్ వినిపిస్తోంది. అదే విధంగా ఇదే ప్లాన్‌లోనే సద్దుల బతుకమ్మ గ్రౌండ్‌కు కూడా చోటు కల్పిస్తే ఓ వైపు రక్షణతో పాటు ఇతర ప్రయోజనాలు కూడా నెరవేరుతాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

మళ్లీ ప్రతిపాదనలు

గత ప్రభుత్వ హయాంలో ముర్రేడువాగు రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. అయితే నిర్మాణ పనుల కోసం కేటాయించిన రూ.35 కోట్లకు సంబంధించి ఆర్థిక శాఖ నుంచి పరిపాలన అనుమతులు రాలేదు. దీంతో పనులు చేపట్టలేదు. రక్షణ గోడ నిర్మాణానికి మరోసారి ప్రతిపాదనలు పంపుతున్నాం.

– అర్జున్, జలవనరుల శాఖ ఈఈ

సింగరేణిలో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో 268 పోస్టుల(ఎక్స్‌టర్నల్) భర్తీకి గత నెల 22న నోటిఫికేషన్ జారీ చేయగా, శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ విషయాన్ని సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. సంస్థలోని వివిధ కేడర్లలో 268 పోస్టులు భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు సర్టిఫికెట్లను ఒకటికి రెండు సార్లు సరిచూసుకుని ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కాగా, పరీక్షకు సంబంధించి విధివిధానాలు కోలిండియా యాజమాన్యం నుంచి రావాల్సి ఉందని.. ఆతర్వాత యాజమాన్యమే పరీక్ష నిర్వహించాలా ఏదైనా సంస్థకు అప్పగించాలా? అనే నిర్ణయం జరుగుతుందని తెలిపారు. కాగా, ఏప్రిల్ చివరి వారం లేదా మే మొదటి వారంలో పరీక్ష నిర్వహించే అవకాశముందని జీఎం పేర్కొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వ్యవసాయశాఖాధికారి బాబూరావు



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

చర్ల: రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటలను కాండం తొలుచు పురుగు ఆశిస్తోందని, దీని పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబూరావు సూచించారు. మండలంలోని కేశవాపురం, దండుపేట గ్రామాలలో రైతులు సాగు చేసిన వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, లేదా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కిలోల చొప్పున వేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి కింద పంట సాయం పొందేందుకు ఈ–కేవైసీ చేయించుకోవాలన్నారు. ఏఓ శివరాంప్రసాద్, ఏఈఓ అఫ్రిద్, రైతులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే



పల్లె వెలుగు బస్సులో వెళ్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. శుక్రవారం ఆయన దమ్మపేట మండలం మందలపల్లి వద్ద తన వాహనం దిగి ఆకస్మాత్తుగా పల్లె వెలుగు బస్సు ఎక్కి అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్సులో తనతోపాటు గన్‌మెన్లు, నాయకులకు ఎమ్మెల్యే డబ్బు చెల్లించి టికెట్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి

నేచర్ క్యాంప్‌లో డీఈఓ వెంకటేశ్వరాచారి



వాటర్ బాటిల్ అందజేస్తున్న డీఈఓ

పాల్వంచరూరల్: పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. కిన్నెరసానిలో శుక్రవారం నేచర్ క్యాంప్ నిర్వహించగా, డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రకృతిపై అవగాహన పెంపొందించుకునేందుకు నేచర్ క్యాంప్‌లు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కావొద్దని, పరిసరాలను గమనించాలని సూచించారు. పాఠశాలల స్థాయిలో పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఎంపిక చేసిన ఎన్‌జీసీ పాఠశాలలకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరావు మాట్లాడుతూ ఎన్‌జీసీ సహకారంతోనే నేచర్‌క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో ఐదు పాఠశాలలనుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఎన్‌జీసీ రాష్ట్ర ప్రతినిధి ఎం.రాజశేఖర్, వైల్డ్‌లైఫ్ రేంజర్ శ్రీనివాసరావు, గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పల్స్ పోలియో

- జిల్లాలో 98,358 మంది ఐదేళ్లలోపు పిల్లల గుర్తింపు
- చుక్కల మందు పంపిణీకి 925 కేంద్రాలు సిద్ధం
- గొత్తికోయ, వలస కార్మికుల పిల్లలకూ పోలియో చుక్కలు..



కొత్తగూడెంరూరల్: ఈ నెల 3వ తేదీ నుంచి మూడు రోజులపాటు జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కల మందు వేయనుండగా, అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. గత నెల 26న కలెక్టర్ ప్రియాంక ఆల అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. సమస్యాత్మక గ్రామాల్లోని పిల్లలకు కూడా కచ్చితంగా పల్స్ పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో 925 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 98,358 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని గుర్తించారు. ఇందుకోసం 38 మొబైల్ టీమ్‌లు, 38 ట్రాన్సిస్ట్ పాయింట్‌లు ఏర్పాటు చేశారు. 38 పీహెచ్‌సీలు, ఆరు వైద్యవిధానపరిషత్ ఆస్పత్రులు కూడా చుక్కల మందు వేయనున్నారు. రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు, ఇతర బస్సు స్టాఫ్‌లలో కూడా పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేశారు. ఇక 4, 5 తేదీల్లో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు మొత్తం 2,384 మంది ఇంటింటా తిరిగి మొదటి రోజు పోలియో చుక్కలు వేయించుకోనివారిని గుర్తించి చుక్కల మందు వేస్తారు. పోలియో వ్యాక్సిన్ సరఫరాతోపాటు పర్యవేక్షణకు 90 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జేవీఎల్ శిరీష పర్యవేక్షిస్తారు.

104 గొత్తికోయ గ్రామాల్లో కూడా..

జిల్లాలో 200 గ్రామాలను హైరిస్క్ గ్రామాలుగా గుర్తించారు. ఇందులో 104 గొత్తికోయ గ్రామాలు ఉన్నాయి. ఆళ్లపల్లి మండలం బూసురాయి, పెద్ద వెంకటాపురం, దుమ్ముగూడెం మండలంలో గద్దెమడుగు, చర్ల మండలంలో పుల్లిగుండం, ములకలపల్లి మండలంలో పాలవాగు తదితర పల్లెలు ఉన్నాయి. మిగతా 96 గ్రామాలు సమస్యాత్మక గ్రామాల్లోని ఇటుకలు తయారీ చేసే కూలీలు, మిర్చి కూలీలు, ఇతర రాష్ట్రం నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక గ్రామాలకు మొబైల్ టీమ్ ద్వారా చుక్కలు పంపిణీ చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంఅర్బన్: ఈ నెల 3వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కోరారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో కూడా చుక్కల మందు వేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నూరుశాతం చుక్కలు వేయాలి



జిల్లాలో ఈ నెల 3వ తేదీ నుంచి మూడు రోజులపాటు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తాం. సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. ఆయా గ్రామాల్లో మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు పంపిణీ చేస్తాం. నూటికి నూరు శాతం పోలియో చుక్కలు వేసేలా ఏర్పాట్లు చేశాం. పోలియో రహిత సమాజ స్థాపనకు తల్లిదండ్రులు ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి.

–జేవీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ

4 నుంచి డీఎస్సీ దరఖాస్తులు..

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ–2024 ఖాళీల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, డీఈడీ అభ్యర్థులు ఈ నెల 4 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 447 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఒక్క పోస్టుకు దరఖాస్తు రుసుము రూ.1000 చెల్లించాలని, ఇతర కేటగిరీల పోస్టులకు విడిగా దరఖాస్తు చేస్తే రూ.1000 చొప్పున రుసుము చెల్లించాలని వివరించారు. 2023 జూలై 1 నాటికి 18 ఏళ్లు నిండి 46 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు ఐదేళ్లు వయోపరిమితి సడలింపు ఉంటుందని తెలిపారు. గత డీఎస్సీలోని పాత పోస్టులకు కొత్తగా ఖాళీలను జత చేస్తూ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసినందున పాత అభ్యర్థులు మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని సూచించారు. డీఎస్సీ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తేవొద్దు

కలెక్టర్ ప్రియాంక ఆల



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురావొద్దని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆదేశించారు. ఇంటర్, 10వ తరగతి పరీక్షలు, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తేవొద్దని సూపరింటెండెంట్లకు మరోసారి ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఇంటర్, 10వ తరగతి పరీక్షలు జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్‌సంఖ్య, గ్యాస్ కనెక్షన్ నెంబరు, విద్యుత్ మీటరు నెంబరు కలిగి ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తు చేసుకున్నవారికి రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలు అమలవుతాయని తెలిపారు. ఇప్పటివరకు ప్రజాపాలన దరఖాస్తులు సమర్పించని వారు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ పీడీ విద్యాచందన, జెడ్పీ సీఈఓ ప్రసూనారాణి, ఇంటర్మీడియట్ అధికారి సులోచన, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి, విద్యుత్ ఎస్‌ఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీఓలు, ఎంపీఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు మోటారు రిపేర్లు, హ్యాండ్ పంప్ రిపేర్లు చేయించాలన్నారు. గత మూడేళ్లలో తీవ్ర నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి నివారణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. అవసరమైతే వ్యవసాయ బోర్లను అద్దె ప్రాతిపదికన వినియోగించుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులను ప్రతి నెలా 1, 11, 21 తేదీల్లో విధిగా శుభ్రం చేయాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మున్సిపల్ పరిధిలో రోడ్లు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. డీఆర్‌డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ ప్రసూనారాణి, అధికారులు తిరుమలేష్, ఇందిర, శ్రీనివాసరావు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు వచ్చేనా..?

- ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..
- ఇటీవల ప్రజాపాలన సభల్లోనూ దరఖాస్తుల స్వీకరణ



చుంచుపల్లి: కొత్త పింఛన్లు ఇప్పట్లో వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. అర్హులు ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నా.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ పెన్షన్లు మంజూరయ్యేలా లేవు. అర్హులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా ప్రభుత్వం వెబ్‌సైట్‌ను నిలిపివేసింది. ఆసరా పింఛన్ అర్హత వయసును గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గించి, 2021 ఆగస్టులో దరఖాస్తులను స్వీకరించగా, 33,663 మంది అర్జీ పెట్టుకున్నారు. విచారణ అనంతరం వీరిలో 26,351 మందికి 2022 ఆగస్టులో పింఛన్లు మంజూరు చేసింది. మిగతా దరఖాస్తులను తిరస్కరించింది. దీనికితోడు కొందరు అర్హులు దరఖాస్తులు సమర్పించలేదు. అలాంటివారికి 2022, ఆగస్టు 1వ తేదీ వరకు దరఖాస్తు గడువు కల్పించారు. అధికారులు ప్రచారం చేయకపోవడంతో ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. ప్రజలకు తెలిసేలోపే అప్పటి ప్రభుత్వం సంబంధిత వెబ్‌సైట్ నిలిపివేసింది. దీంతో కొందరు గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందించారు. పింఛన్లు మంజూరు చేయాలని వృద్ధులు, దివ్యాంగులు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమాల్లో ఫిర్యాదులు చేస్తున్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన గ్రామసభల్లోనూ పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

1.19 లక్షల మంది లబ్ధిదారులు

ప్రస్తుతం జిల్లాలో 1,19,290 మంది ఆసరా లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో వృద్ధులు 46,572, దివ్యాంగులు 13,718, వితంతువులు 51,055, ఒంటరి మహిళలు 6,268, ఏఆర్‌టీ బాధితులు 1,215, ఫైలేరియా బాధితులు 177, డయాలసిస్ వ్యాధిగ్రస్తులు 116, గీత కార్మికులు 147, మంది, చేనేత కార్మికులు 18 మంది, బీడీ కార్మికులు నలుగురు చొప్పున ఉన్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ. 26.81 కోట్లను పింఛన్ల రూపంలో అందజేస్తుంది. జిల్లాలో మరో 40 వేల మంది వరకు కొత్తగా ఆసరా పింఛన్లకు అర్హులు ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. కాగా ఆసరా పింఛన్ పథకంలో భాగంగా ప్రతినెలా దివ్యాంగులకు రూ.4,016 ఇస్తుండగా, వృద్ధులు, వితంతువు, ఒంటరి మహిళలు, చేనేత, బీడీ కార్మికులు, బోదకాలు, ఎయిడ్స్, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు రూ.2,016 చొప్పున అందిస్తున్నారు

కొత్తగా 69,136 దరఖాస్తులు

ఇటీవల కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభల్లో పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించింది. వృద్ధులతోపాటు దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువు, చేనేత, బీడీ కార్మికులు, బోదకాలు, ఎయిడ్స్, డయాలసిస్ బాధితులు 69,136 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో దివ్యాంగులు 7,438 మంది ఉన్నారు. పింఛన్ల మంజూరుపై కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరోవైపు ఏడాదిన్నరగా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వీలులేకపోవడంతో వృద్ధులు ఆందోళన చెందుతున్నారు.

మళ్లీ దరఖాస్తు చేసుకున్నా



ఆసరా పథకంలో భాగంగా వృద్ధాప్య పెన్షన్ కోసం గతంలో ఒకసారి దరఖాస్తు సమర్పించాను. గత ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన సభలో మరోసారి దరఖాస్తు ఇచ్చాను. ఈ ప్రభుత్వమైనా పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– సయ్యద్ హుస్సేన్

క్లుప్తంగా

లబ్ధిదారులకు రేషన్ సక్రమంగా అందించాలి

డీఎస్‌ఓ రుక్మిణి దేవి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ రుక్మిణిదేవి

భద్రాచలంటౌన్: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం లబ్ధిదారులకు సక్రమంగా అందేవిధంగా రేషన్ డీలర్లు చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఓ రుక్మిణిదేవి అన్నారు. భద్రాచలం పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీకి సంబంధించిన రికార్డులతో పాటు బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహించే డీలర్లపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై సమీక్ష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

కొత్తగూడెంరూరల్: జిల్లాలో 14 ఏళ్లలోపు పిల్లలకు కుష్ఠు వ్యాధి సోకితే వెంటనే ఆ గ్రామాల్లో సర్వే చేపట్టాలని డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష ఆదేశించారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని డిప్యూటీ పారా మెడికల్ అధికారులతో ఆమె శుక్రవారం సమీక్ష నిర్వహించారు. కుష్ఠు వ్యాధి ద్వారా కలిగిన అంగవైకల్యం గుర్తించి ఆపరేషన్ చేయించాలని ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో భాస్కర్, టి.మోహన్, ఎ.గన్య, పి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, ముత్యాలరావు, కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, ఫిజియోథెరపిస్ట్ భద్రు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములు ఆదర్శాన్ని కొనసాగిస్తాం

అరుణోదయ రాష్ట్ర కమిటీ నివాళి



శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఇల్లెందురూరల్: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య భద్రాద్రి జిల్లా కన్వీనర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కోడి శ్రీరాములు ఆదర్శాలు, స్ఫూర్తిని కొనసాగిస్తామని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగన్న, దాసు వెల్లడించారు. ఇల్లెందు మండలం మాణిక్యారంలో కోడి శ్రీరాములు చిత్రపటానికి రాష్ట్ర కమిటీ ప్రతినిధులు శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తన పాటలతో ఉత్తేజాన్ని నింపిన కళాకారుడు శ్రీరాములు అని కొనియాడారు. ఉద్యమంలో తన సహచరులు కొందరు పెడమార్గంలో పయనించినా ఆయన మాత్రం పేదల పక్షాన నిలిచిన ఆదర్శవంతుడిగా మిగిలి పోయారని తెలిపారు. శ్రీరాములు అందించిన స్ఫూర్తితో పేదల పక్షాన నిలబడి శ్రమదోపిడీ లేని సమరాజ్యం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర నాయకులు మల్లన్న, బొగ్గారపు వెంకన్న, చిరంజీవి, జ్యోతి, కాంతారావు, శ్రీకాంత్, కిషన్‌నాయక్, నాగమల్లు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళకు ఎంఫిల్, గోల్డ్‌మెడల్



ఎంఫిల్ పట్టా అందుకుంటున్న వరలక్ష్మి

కరకగూడెం: భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామమైన వీరాపురానికి చెందిన ఆదివాసీ మహిళ కుంజ వరలక్ష్మి ఎంఫిల్ సాధించడమే కాక ఉత్తమ ప్రతిభకు గోల్డ్ మెడల్ అందుకుంది. హనుమకొండలోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో పట్టిడ కోయ అంశంపై ఆమె ఎంఫిల్ పూర్తిచేసింది. ఈ సందర్భంగా గత నెల 28న హైదరాబాద్లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్‌తో పాటు పట్టా అందుకుంది. ఈసందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ తన భర్త వజ్జ నరసింహారావు ప్రోత్సాహంతో ఈ ఘనత సాధించానని వెల్లడించగా.. పలువురు ఆమెను అభినందించారు.

వ్యక్తి మృతి

కొత్తగూడెంఅర్బన్: పురుగులమందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కూలీలైన్ ఏరియాకు చెందిన నాగరాజు (35) భార్య కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో నుంచి వెళ్లింది. నాగరాజు తన భార్య పుట్టింటికి వెళ్లి ఉంటుందా? అని వాకబు చేయగా అక్కడికి రాలేదని తెలియడంతో గురువారం పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చేర్పించగా మృతి చెందాడు. శుక్రవారం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

ఆస్తిపన్ను బకాయిల వసూళ్లకు 'ఓటీఎస్'

- ఒకేసారి కడితే 90 శాతం వడ్డీ మాఫీ
- కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అవకాశం
- ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో వేలాది మందికి ఊరట



కొత్తగూడెం మున్సిపాలిటీ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: పుర, నగరపాలక సంస్థల్లో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలను వసూలు చేసేందుకు ప్రభుత్వం, పురపాలక శాఖ మరోసారి వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ఆస్తిపన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ చేస్తూ పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.దానకిశోర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది మంది బకాయిదారులకు ఊరట కలగనుంది. ఉమ్మడి జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు రూ.కోట్ల మేర ఆస్తిపన్ను బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలపై ఏటా నానాటికీ వడ్డీ పెరుగుతూ ఉంటుంది. ఈ మేరకు పన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 90 శాతం రాయితీ వర్తించనుండటంతో బకాయిదారులు ముందుకొస్తారని భావిస్తున్నారు.

ఈ నెల 31 వరకు గడువు

ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90 శాతం రాయితీకి ఆ శాఖ గడువు విధించింది. ఈ నెల 31వ తేదీలోపు చెల్లిస్తేనే బకాయిలపై 10 శాతం వడ్డీ కడితే సరిపోతుంది. పుర, నగర పాలకసంస్థలకు రావాల్సిన బకాయిలను వసూలు చేసుకునేందుకు పురపాలక శాఖ గతంలోనూ రాయితీలను ప్రకటించింది. అయితే ఈసారి బకాయిల వసూళ్లకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఉన్నతాధికారులు సూచనలు చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా బకాయిలు లేకుండా వంద శాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను బకాయిల వివరాలు

కార్పొరేషన్ / మున్సిపాలిటీ	అసెస్‌మెంట్లు	బకాయి
ఖమ్మం	35,125	రూ.32.70 కోట్లు
కొత్తగూడెం	23,369	రూ.4.53 కోట్లు
వైరా	7,029	రూ.1.83 కోట్లు
సత్తుపల్లి	1,600	రూ.1.24 కోట్లు
వైరా	7,029	రూ.1.83 కోట్లు
ఇల్లెందు	8,124	రూ.89.79 లక్షలు
మధిర	1,564	రూ.47 లక్షలు
మణుగూరు	7,000	రూ.40 లక్షలు
పాల్వంచ	19,671	రూ.1.56 కోట్లు

లెక్కలు కడుతున్న అధికారులు..

ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీ రాయితీని ప్రకటించడంతో అధికారులు మున్సిపాలిటీల వారీగా లెక్కలు వేస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను బకాయిలు, వాటికి సంబంధించిన వడ్డీ నమోదై ఉంది. బకాయిదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే దానంతట అదే రాయితీతో తీసుకునేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసేశారు. కాగా, బకాయిదారులు చెల్లింపునకు ముందుకొచ్చేలా విస్తృత ప్రచారం మొదలుపెట్టారు. ఆటోలకు మైక్‌లు బిగించి పన్ను చెల్లించాలని వీధివీధిన ప్రచారం చేస్తున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటన్నింట్లో 1,10,511 అసెస్‌మెంట్లకు గాను ఆస్తి పన్ను బకాయి రూ.45.45 కోట్లకు పైగానే పేరుకుపోయింది. అత్యధికంగా ఖమ్మం కార్పొరేషన్‌లో రూ.32.70 కోట్ల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం వడ్డీపై రాయితీ ప్రకటించిన నేపథ్యాన బకాయిదారులు ముందుకొచ్చేలా అధికారులు నిరంతరం ఉద్యోగులతో సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

ఒకేసారి నాలుగు..మూడు..రెండు..!

నాలుగు ఉద్యోగాలు సాధించిన గిరిజన యువతి



మలకం రమాదేవి

కరకగూడెం: ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో శ్రమించిన గిరిజన యువతి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఒకేసారి నాలుగు ఉద్యోగాలకు ఎంపికైంది. కరకగూడెం మండలంలోని మా రుమూల ప్రాంతమైన గొల్లగూడెంలో నిరుపేద కుటుంబానికి చెందిన మలకం వెంకన్న – సరోజన దంపతుల రెండో కుమార్తె రమాదేవి విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లో కొనసాగింది. పినపాక మండలం ఐలాపురం మినీ గురుకులం, భద్రాచలం గురుకులంలో పదో తరగతి వరకు చదువుకున్నాక వరంగల్‌లోని కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలో ఇంటర్, డిగ్రీ, భద్రాచలంలో బీఈడీ, కేయూలో ఎమ్మెస్సీ గణితం, ఇంగ్లిష్ పూర్తిచేసింది. ఓయూలో ఎంఈడీ చేస్తూనే ఉద్యోగాలకు సిద్ధమైంది. తాజాగా వెల్లడైన గురుకుల బోర్డ్ ఫలితాల్లో జేఎల్ ఇంగ్లిష్, పీజీటీ ఇంగ్లిష్, టీజీటీ ఇంగ్లిష్, టీజీటీ గణితం ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కృషి, పట్టుదలతో ముందుకు సాగితే విజయం సొంతమవుతుందని తెలిపారు.

నాలుగు ఉద్యోగాలు సాధించిన అధ్యాపకురాలు..



ధ్రువపత్రం అందుకుంటున్న భవానీ

ఇల్లెందు: ఏక కాలంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు కైవసం చేసుకున్నారు ఇల్లెందుకు చెందిన అధ్యాపకురాలు. పట్టణంలోని కాకతీయనగర్ 9వ వార్డుకు చెందిన వీరయోదుల భవానీ గురుకులం పీజీటీ, టీజీటీ బయోసైన్స్, టీజీటీ సైన్స్, గురుకులం జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించింది. మహబూబాబాద్ కస్తూర్బాలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఆమె కష్టపడి చదివి విజయం సాధించింది. అంతిమంగా గురుకులం జూనియర్ లెక్చరర్ పోస్టును ఎంపిక చేసుకుంది.

మూడు ఉద్యోగాలకు ఎంపికైన పెద్దిరాజు



బొడ్డుపల్లి పెద్దిరాజు

అన్నపురెడ్డిపల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలోనూ వరుసగా మూడు ఉద్యోగాలు సాధించాడు మండలానికి చెందిన ఓ యువకుడు. టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలకు ఎంపికై సత్తా చాటాడు. మండలంలోని తొట్టిపంపు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి పెద్దిరాజు ఇటీవల ప్రకటించిన గురుకుల ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్ ఉద్యోగాలు సాధించాడు. పెద్దిరాజు తల్లిదండ్రులు సైదులు, సీతమ్మ వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. పెద్దిరాజును పలువురు అభినందించారు.

జేఎల్‌గా ఎంపికైన జోష్ణవి...



జోష్ణవి

చుంచుపల్లి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గురుకుల అధ్యాపకుల ఫలితాల్లో చుంచుపల్లి తండాకు చెందిన భూక్యా జోష్ణవి జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. గతేడాది నిర్వహించిన గురుకుల అధ్యాపకుల పోటీ పరీక్షలకు హాజరైన ఆమె తొలి ప్రయత్నంలో ఉద్యోగాన్ని సాధించగా.. ఆమె తల్లిదండ్రులు భూక్యా రాందాస్, సునీత, గ్రామస్తులు అభినందించారు.

టీజీటీ సాధించిన మండలవాసి



భూక్య రాజశేఖర్

టేకులపల్లి: టీజీటీ (ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్) పోస్టులకు గతేడాది జరిగిన పరీక్ష ఫలితాలు రెండు రోజుల కిందట విడుదలైన విషయం తెలిసిందే. కాగా, మండలంలోని బద్దుతండా పంచాయతీ నంద్యాతండాకు చెందిన భూక్య రామకోటి – బోడి దంపతుల కుమారుడు భూక్య రాజశేఖర్ టీజీటీ ఉద్యోగం సాధించాడు. రాజశేఖర్‌ను పలువురు అభినందించారు.

పట్టుదలతో కొలువు సాధించి..



నాగేశ్వరరావు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన పాయం నాగేశ్వరరావు గురుకులం ఫలితాల్లో టీజీటీ, జేఎల్ ఉద్యోగాలు సాధించాడు. ఆయన ప్రైవేట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు.

మెడికల్ షాపులో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని కీర్తి మెడికల్ దుకాణంలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండుగుడు చోరీకి పాల్పడ్డాడు. మూసి ఉన్న షెట్టర్ తాళాలు పగులగొట్టి దుకాణంలోకి ప్రవేశించి, రూ.1.30 లక్షల నగదు చోరీ చేశాడని యజమాని ఉమామహేశ్వరరావు తెలిపారు. చోరీ చేసిన వ్యక్తి షాపులో నుంచి బయటకు వస్తున్న వీడియో ఎదురుగా ఉన్న సీసీ కెమెరాలో రికార్డయింది. కొత్తగూడెం క్లూస్ టీం చోరీ ప్రదేశాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రామాలయ ఏఈఓకు మెమో జారీ

- కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు
- సమగ్ర నివేదిక కోరిన కలెక్టర్

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పనిచేసే ఏఈఓ శ్రావణ్‌కుమార్‌కు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి మెమో జారీ చేశారు. దేవస్థానం పరిధిలో నిర్మిస్తున్న ఓ సదనం నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తామని ఓ సంస్థ నుంచి రూ.లక్షలు వసూలు చేశారనే ప్రచారం రెండు రోజులుగా జరుగుతోంది. రెండేళ్లకు ముందు ఆ నగదు తీసుకొని నిర్వహణ బాధ్యతలను అప్పగించకపోవడంతో సంస్థ బాధ్యులు రెండు రోజుల కిందట దేవస్థానం కార్యాలయానికి వచ్చి వాగ్వాదానికి దిగారు. దీంతో ఆ సంస్థకు ఏఈఓ సుమారు రూ.11 లక్షలు సైతం తిరిగి చెల్లించాడని 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో దేవస్థానం ప్రతిష్టకు భంగం వాటిల్లే విధంగా వ్యవహరించిన ఆ అధికారికి వివరణ ఇవ్వాలంటూ ఈఓ రమాదేవి శుక్రవారం మెమో జారీ చేశారు.

కమిషనర్‌కు బాధితుల ఫిర్యాదు

ఏఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సదరు అధికారిపై బాధిత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దేవాదాయ శాఖ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఈఓ రమాదేవిని విచారణ చేపట్టాలని కమిషనర్ నుంచి ఆదేశాలు అందాయి. కాగా, మూడు రోజులుగా మీడియాలో ఈ వార్తలు సంచలనం సృష్టిస్తుండటంతో కలెక్టర్ ప్రియాంక ఆల సైతం దీనిపై సమగ్ర నివేదిక అందించాలని ఈఓ రమాదేవిని ఆదేశించారు. తొలుత ఈఓ రమాదేవి మెమో జారీ చేశారు. అనంతరం సమగ్ర విచారణ జరిపి నివేదికను జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ కమిషనర్‌కు అందిమని ఈఓ తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన 'బ్యాంక్' బాధితులు



వివరాలు చెబుతున్న బాధిత మహిళలు

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్, సంజయ్‌నగర్ గ్రామాలకు చెందిన, బ్యాంకు రుణం పేరుతో మోసానికి గురైన మహిళలు పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. తమకు తెలియకుండానే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో కరెంటు అకౌంట్లు ప్రారంభించిన ఖమ్మానికి చెందిన వ్యక్తులు తమను మోసం చేశారని ఆరోపిస్తూ బాధిత మహిళలు సల్మా, నజియా, అఫ్రిన్, సౌజన్య, సంధ్య శుక్రవారం ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి సేకరించిన స్టేట్‌మెంట్‌ను పోలీసులకు అందజేసి కేవలం రెండు నెలల్లోనే తమ పేరిట రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయని వాపోయారు. దీంతో స్పందించిన సీఐ కరుణాకర్ బ్యాంకు అకౌంట్లు ప్రారంభించిన క్రమం నుంచి విచారణ చేపడుతామని, శనివారం దీనిపై సమగ్ర విచారణ చేపడుతామని చెప్పారు. ఇదే విషయమై స్థానిక విలేకరులతో సీఐ కరుణాకర్ మాట్లాడుతూ.. బాధితుల నుంచి ఖాతాలు తెరిచేందుకు వచ్చిన వారిని పిలిపించి సమగ్ర విచారణ చేపడుతామని.. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

మృతుడి కుటుంబానికి పరిహారం పంపిణీ



చెక్కు అందజేస్తున్న అధికారులు, నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.సత్యకృష్ణ 2022లో కరోనాతో మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబానికి శుక్రవారం సెక్యూరిటీ అధికారులు రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందించారు. సెక్యూరిటీ జీఎం దీక్షితులు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్‌హుస్సేన్, వేణుమాధవ్, ఏఐటీయూసీ నాయకులు రమణమూర్తి, కృష్ణయ్య, శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకులు త్యాగరాజన్, ఆల్బర్ట్ పాల్గొన్నారు.

ఆ అధికారి ఉంటే పనిచేయలేం..

- పర్సంటేజీ ఇవ్వనిదే ఫైల్ తీయడం లేదు
- సింగరేణి ఉన్నతాధికారులకు బొగ్గు టిప్పర్ కాంట్రాక్టర్ల ఫిర్యాదు

సత్తుపల్లి: సింగరేణి సంస్థలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఓ అధికారి కొర్రీలు పెట్టి వేధిస్తుండడమే కాక ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నాడని బొగ్గు టిప్పర్ కాంట్రాక్టర్లు చేసిన ఫిర్యాదులు కలకలం రేపుతోంది. ఆ అధికారి ఒకే ప్రాంతంలో రెండు హోదాల్లో సుమారు పదేళ్లుగా పనిచేస్తూ.. సర్వాధికారిగా అన్ని ఓసీలపై పెత్తనం చేస్తూ పర్సంటేజీ లేనిదే బిల్లులు విడుదల చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. సదరు అధికారి మాట వినకపోతే కొర్రీలు పెట్టి నెలల తరబడి బిల్లులు రానివ్వడనే భయంతో ఇంతకాలం నోరు మెదపలేదని.. ఇప్పుడు కాంట్రాక్ట్ పోయినా సరే ఆత్మాభిమానం వదులుకోలేక ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని ఓ కాంట్రాక్టర్ వాపోయాడు.

రోడ్డు వేయకుండానే...

సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ నుంచి జేవీఆర్ సైలో బంకర్‌కు 5.4 కిలోమీటర్ల మేర బొగ్గు రవాణా చేసేందుకు టన్నుకు రూ.6.90 చెల్లించేలా టెండర్ పిలిచారు. అయితే ఆ మార్గంలో సీసీ రోడ్డు వేస్తామని చెప్పినా అమలుకాలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. తద్వారా మట్టి రహదారి కావడంతో గోతుల కారణంగా టిప్పర్లు దెబ్బతినడమే కాక అదనంగా కిలోమీటర్ మేర చుట్టూ పది నెలల పాటు టిప్పర్లు తిప్పడంతో డీజిల్ వ్యయం పెరిగిందని చెప్పినా పట్టించుకోలేదని ట్రాన్స్‌పోర్టర్ల ప్రతినిధి వాపోయారు. రోడ్డు వేయాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోవడం వల్లే టిప్పర్లు దెబ్బతిన్నాయని, పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇక బొగ్గు గనుల విస్తరణకు భూములు ఇచ్చిన పలువురు ఉపాధి కోసం ఫైనాన్స్‌లో టిప్పర్లు కొనుగోలు చేసి సింగరేణి సంస్థలో అద్దెకుపెట్టారు. అయితే, రూ.లక్షల బిల్లులు నిలిపివేసి మానసిక వేధింపులకు గురిచేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని భూనిర్వాసిత రైతులు, బొగ్గు టిప్పర్ల యజమానులు కోరుతున్నారు.

అవేవీ నిజం కాదు...

ఆరోపణలు ఎదుర్కొన్న సదరు అధికారిని వివరణ కోరగా రోడ్డు వేయాల్సిన బాధ్యత తమదేనని తెలిపారు. దీనిపై టెండర్లు పిలిచామని చెప్పారు. ఇక ఇతర ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు. తప్పుడు ఆరోపణలు చేసేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని తెలిపారు.

స్వర్ణకవచధారణలో రామయ్య దర్శనం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

ఫిబ్రవరిలో 2 లక్షల మంది భక్తుల దర్శనం

ఫిబ్రవరి నెలలో స్వామివారిని రెండు లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అత్యధికంగా ఫిబ్రవరి 4న 11 వేల మంది, అత్యల్పంగా 27వ తేదీన 1,627 మంది దర్శించుకున్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం పంచామృతాభిషేకం జరిపారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు చింత నాగరాజు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని, గంజాయి రవాణా చేసినా, వినియోగించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఐఎంఏ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా చూడాలన్నారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో అధికారులు సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గంజాయి, పీడీఎస్ రైస్ అక్రమరవాణా, మట్కా, జూదంలాంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. జిల్లా వ్యాప్తంగా హాట్‌స్పాట్‌లను గుర్తించి గంజాయి రవాణాదారులను, గంజాయి వినియోగదారులను గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం ఉత్తమ పనితీరును కనబరిచిన కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్, టూటౌన్ సీఐ రమేష్‌కుమార్‌తో పాటు మరికొందరిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, వెంకటేష్, చంద్రభాను, రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ

కరకగూడెం: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రావుల తేజ తన ద్విచక్ర వాహనంపై కలవలనాగారం నుంచి కరకగూడెం వైపు వస్తున్న క్రమంలో కుర్నవల్లి వద్దకు రాగానే ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న పోలేబోయిన రవి ఢీకొన్నారు. దీంతో తేజ కాలి మడమ విరగగా, రవి కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. కరకగూడెంలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం తేజను మెరుగైన వైద్యం కోసం పాల్వంచలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, రవిని మణుగూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా, క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియరాలేదు.